క్లుప్తంగా

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



కొల్లా వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటకు చెందిన వార్డు సభ్యుడు, ఆర్యవైశ్య సంఘం నేత కొల్లా వెంకటేశ్వర్లు తండ్రి అయిన కొల్లా సుబ్రహ్మణ్యం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. అనంతరం స్థానిక ఠాగూర్ రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరెస్పాండెంట్ రమణారెడ్డి, ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి తండ్రి దశరథరామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు సంధాని బాషా, ముజీర్, జాకీర్, పఠాన్ ఖాదర్ బాషా, శ్రీనివాసులరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఏఈఆర్‌ఓ నెప్రూబాబు

ఉదయగిరి: మండలంలోని బీఎల్వోలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెప్రూబాబు సూచించారు. ఆయన తన కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటి నుండే వసతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అంగన్‌వాడీలు విధులు బాధ్యతగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య

ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు, కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలని ఉదయగిరి సీడీపీఓ పచ్చవ లావణ్య అన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో ప్రాజెక్ట్ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు యాప్‌ల్లో సమగ్ర సమాచారం అప్‌లోడ్ చేయాలన్నారు. పౌష్టికాహారం కేంద్రంలోని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. నెలవారీ నివేదికలు సకాలంలో కార్యాలయంలో అందజేయాలన్నారు. సెలవు అవసరమైతే ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం ఉదయగిరి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియోపై వైద్య ఆరోగ్య సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు వెంకట సుబ్బయ్య, ఏఎ రేణుకా, అంగన్‌వాడీ పర్యవేక్షకులు కళావతి, తేజస్విని, షాను, రత్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రతిష్ఠోత్సవ పూజలు



నందవరంలోని విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం

మర్రిపాడు: మండలంలోని నందవరంలో నూతనంగా నిర్మించిన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహ సహిత ధ్వజ కుంభాభిషేకం, నాగప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితులు ఆగమశాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి దేవదేవేరుల ఆశీస్సులు పొందాలన్నారు.

వరికి నీరివ్వాలని వినతి

చేజర్ల: మండలంలోని పాడేరు పంచాయతీ చెరువు కింద సుమారు 270 ఎకరాల్లో వరి సాగు చేశారని, చెరువులో నీరు లేకపోవడంతో పైరు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, పైరుకు నీరివ్వాలని బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు కుంకు బాలయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, నాయకులు నారాయణరెడ్డి, వెంకటయ్య, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక దన్ను

జమ్మలపాళెం సచివాలయం పరిధిలో 1,243 కుటుంబాలు

- డీబీటీ, నాన్ డీబీటీ లబ్ధిదారులు 8,435 మంది
- డీబీటీ ద్వారా 6,179 మందికి రూ.17,45,90,176 లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా 2,256 మందికి రూ.6,26,16,256 ప్రయోజనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికానికి దన్నుగా నిలుస్తున్నారు. అమలవుతున్న సంక్షేమ పథకాలు పేదరికాన్ని రూపుమాపుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక సంక్షేమ పథకం అమలైతే మండలంలో ఇద్దరికో... ముగ్గురికో అందేది. ఈ పథకం కోసం జన్మభూమి కమిటీల కాళ్లు.. గడ్డాలు పట్టుకున్నా.. ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిలో సిఫార్సు లేఖలు ఇచ్చిన వారికే దక్కేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి, వలంటీర్ల వ్యవస్థను సృష్టించి అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూర్చిన ఘనత ఈ ప్రభుత్వానిది.



జమ్మలపాళెం సచివాలయం

జలదంకి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైపు అడుగులు వేసింది. దాదాపు 33 పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలిచింది. సంక్షేమ పథకాల ద్వారానే కాకుండా జగనన్న ఇంటి స్థలం, ఇల్లు ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్షల విలువైన స్థిరాస్తిని కల్పించింది. ప్రభుత్వ సేవల కోసం, సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వం నుంచి అందే అన్ని సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. వలంటీర్లు ప్రతి పథకాన్ని లబ్ధిదారులకు వివరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అవినీతికి తావు లేకుండా పథకాలను అందిస్తున్నారు. టీడీపీ హయాంలో ఏ పని కావాలన్నా మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందే. పనులన్నీ మానుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సిబ్బందికి లంచం ఇస్తేనే పనులు అయ్యేవి కావు. ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేది.

మండలం	- జలదంకి
సచివాలయం	- జమ్మలపాళెం
పంచాయతీలు	- జమ్మలపాళెం, ఎల్‌ఆర్ అగ్రహారం
జనాభా	3,914
ఓట్లు	3,172

అందుబాటులో ఉన్న సేవలు

గ్రామ సచివాలయాల్లో ఆదాయం, కులం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్, పోలీస్ వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, సదరం దరఖాస్తులు, 1బీ, అడంగళ్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, టైటిల్ డీడ్, డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్, సర్టిఫైడ్ కాపీ, విద్యుత్ కనెక్షన్, కేటగిరీ మార్పులు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్ని రకాల పింఛన్లు, వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపు నేస్తం, వైఎస్సార్ బీమా, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న తోడు, వాహన మిత్ర, తదితర 542 రకాల సేవలు అందుతున్నాయి.

సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిపొం లబ్ధిదారులు, నగదు

పథకం	లబ్ధిదారులు	నగదు (రూ.)
అమ్మఒడి	471	1,85,71,097
ఆసరా	638	2,06,84,757
చేదోడు	9	1,90,000
కోవిడ్ సహాయం	1,111	11,11,000
ఈబీసీ నేస్తం	39	9,30,000
హౌసింగ్	123	1,38,61,758
ఇన్‌పుట్ సబ్సిడీ	70	6,85,300
వసతిదీవెన	313	38,05,573
విద్యాదీవెన	342	94,07,376
పింఛన్లు	657	6,41,35,250
రైతు భరోసా	477	2,22,82,000
వైఎస్సార్ చేయూత	294	1,24,12,500
వైఎస్సార్ సున్నావడ్డీ	774	32,91,234
వైఎస్సార్ వాహనమిత్ర	37	12,50,000
జగనన్న ఇళ్లు	181	2,62,50,000

సొంతింటి కల నెరవేరింది



నాకు జగనన్న ఇల్లు రావడంతో సొంతింటి కల నెరవేరింది. అమ్మఒడి కూడా ప్రతి ఏడాది అందుతుంది. ఏ పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లకుండా వలంటీర్లే సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేయిస్తున్నారు. సచివాలయం ద్వారా అవసరమైన సేవలన్నీ అందుతున్నాయి. గతంలో నాకు, నాకు తెలిసిన మా వాళ్లకు కూడా ఏ ప్రభుత్వ పథకం అందలేదు. ఇప్పుడు ఎవరి సిఫార్సు లేకుండానే వలంటీర్లు మా ఇళ్లకు వచ్చి పథకానికి అర్హత ఉంటే దరఖాస్తు చేసుకుంటున్నారు. పథకం వచ్చిందని చెప్పి.. అందే వరకు అన్ని జాగ్రత్తలు చూస్తున్నారు.

– షేక్ పీరమ్మ, జమ్మలపాళెం

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయం



సేవా రత్న అవార్డులు అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, వలంటీర్ల సేవలు అభినందనీయమని ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ పి. సుజాత ఆధ్వర్యంలో వలంటీర్లను సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి ఆ కుటుంబాల అవసరాలు తీర్చేందుకు, సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా ఇళ్లకు అందించే విధంగా వలంటీర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రతి పథకం పేద, బడుగు, బలహీన వర్గాలకు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ వ్యవస్థను చూసి, ఇలాంటి వ్యవస్థను ప్రతి రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తుయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు వైద్యం చేయించుకునే విధంగా పరిమితిని పెంచారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా తొలి దశలో పాఠశాలలు, రెండో దశలో ఆస్పత్రుల అభివృద్ధి చేసి వాటి రూపురేఖలు మార్చారన్నారు. ప్రతి పాఠశాల ద్వారా ఇంగ్లిష్ విద్యను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని తిరిగి గెలిపించుకుంటే ప్రతి ఇంటి కలలు సాకారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, పార్టీ మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, మాజీ కన్వీనర్ చిమ్మిలి రాజేంద్ర, సచివాలయ కన్వీనర్ యారం నరసింహారావు, తహసీల్దార్ తుపాకులు మస్తానయ్య, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కమలాకర్, విడవలపాటి మాల్యాద్రి, దార్ల గోపి, బొడ్డు మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, రవీంద్ర, వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, శేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, పార్టీలో సముచిత స్థానం ఇస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగం మండలం వెంగారెడ్డిపాళెంకు చెందిన గుండాల బాలచంద్రారెడ్డి, సిద్ధం నారయ్య ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ కొనసాగేలా శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంగం, ఆత్మకూరు మండలాల నాయకులు ఉన్నారు.

సేవాభావంతో పనిచేయండి

- మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా



మెప్మా పొదుపు సంఘాలతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు: మెప్మా కార్యాలయం సిబ్బంది, అధికారులు పొదుపు సంఘాల సభ్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారికి అందేలా సేవా భావంతో పని చేయాలని కమిషనర్ ఫజులుల్లా చెప్పారు. మెప్మా కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బంది, అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని పొదుపు సమాఖ్యల వివరాలను సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య అయినా, ఏమైనా అవసరమైనా తనను సంప్రదించవచ్చని కమిషనర్ వారికి సూచించారు. జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా తదితర పథకాల ద్వారా అందిన నగదుతో ఆర్థిక ప్రగతి సాధించేలా పలువురు మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించిన విషయం తెలుసుకున్న ఆయన వారిని అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాను మెప్మా కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం అంకయ్య, సీఓఓ మాధవి, పొదుపు సమాఖ్య ఆర్‌పీలు సుష్మా, వెంకట రమణమ్మ, సునంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థల విషయమై ఇరువర్గాల ఘర్షణ

దుత్తలూరు: వివాదంలో ఉన్న స్థల విషయమై ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని నందిపాడులో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. నందిపాడు-రెడ్లదిన్నె మార్గంలో ఉన్న భూమి విషయంలో కొద్ది నెలలుగా నందిపాడు, రెడ్లదిన్నె గ్రామాలకు చెందిన ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతోంది. ఆ భూమి తమదంటే తమదంటూ రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఆ భూమి వద్దకు ఎవరూ వెళ్లవద్దంటూ రెవెన్యూ ఆదేశించారు. ఈ క్రమంలో కొసినిపోగు బాబు, కొసినిపోగు తిరుపతయ్య వివాదంలో ఉన్న భూమిని దున్నుతుండగా అటుగా వెళ్తున్న నందిపాడుకు చెందిన కొసినిపోగు పెంచలయ్య, కొసినిపోగు దేవయ్య గమనించి వారిని అడ్డుకున్నారు. దీంతో వివాదం చెలరేగి బాబు, తిరుపతయ్య కలిసి దేవయ్య, పెంచలయ్యపై దాడి చేశారు. ఇద్దరికి గాయాలు కావడంతో ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. పెంచలయ్యను మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఉమాశంకర్ తెలిపారు.

నేను కుర్చీ వదలను

- ఇన్‌చార్జి ఎంపీడీఓ మొండి వైఖరి
- రెగ్యులర్ ఎంపీడీఓను విధుల్లో చేరనివ్వని వైనం

వరికుంటపాడు: ఎన్నికల కమిషన్ ఆదేశాలనే ధిక్కరిస్తూ ఇన్‌చార్జి ఎంపీడీఓ వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయా మండలాల్లో పని చేస్తున్న ఎంపీడీఓలను పక్క జిల్లాలకు, పక్క జిల్లాల ఎంపీడీఓలను జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే జిల్లాకు కేటాయించిన ప్రకాశం జిల్లా యుద్ధనపూడి ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారిని వరికుంటపాడుకు బదిలీ చేశారు. అయితే విధుల్లో చేరేందుకు గురువారం వచ్చిన కృష్ణమారిని ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేస్తున్న చేవూరి శ్రీదేవి బాధ్యతలు అప్పగించకుండా అడ్డుకున్నారు. జిల్లా అధికారులతో మాట్లాడుకుని నేను ఇక్కడే ఉంటాను. మీరు విధుల్లో చేరొద్దు వేరే మండలం చూసుకోండంటూ గట్టిగట్టిగా కేకలు వేశారు. దీంతో ఆమె చేసేది ఏమీ లేక వెనుతిరిగారు. శుక్రవారం కొత్త ఎండీపీఓ కృష్ణకుమారి ఉదయం 10 గంటలకే ఆఫీసుకు వచ్చి ఎంపీడీఓ సీటులో కుర్చొని విధులకు ఉపక్రమించారు. ఆలస్యంగా వచ్చిన శ్రీదేవి మరో కుర్చీ తెప్పించుకుని పక్కనే కూర్చుని తానే ఎంపీడీఓని అంటూ భీష్మించారు. ఈ ఘటన చూసిన కార్యాలయ సిబ్బంది అవాక్కయ్యారు. బోగోలు ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీదేవి ఆరు నెలల క్రితం రాజకీయ నేతల సిఫార్సులతో వరికుంటపాడు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. స్థానికంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె, ఇన్‌చార్జి ఎంపీడీఓ పోస్టును వదులుకోవడానికి సిద్ధంగా లేక ఏకంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకే కృష్ణకుమారి వరికుంటపాడు ఎంపీడీఓగా వచ్చారు. మరి జిల్లా అధికారులు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

ముస్లిం మతపెద్దలతో ఆత్మీయ సమావేశం





ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు

కావలి: ముస్లిం మతపెద్దలు, నాయకులు, ప్రముఖులతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా తనను, రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు మీ సహకారం కావాలని కోరారు. షాదీమంజిల్ నూతన భవనం నిర్మాణం ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదించామని, తిరిగి మన ప్రభుత్వం వచ్చిన వెంటనే నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముసునూరు ఆటోనగర్ వద్ద మసీదు నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ముస్లిం మతపెద్దలకు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బోగోలు మండలంలోని ఎస్‌వీపీఎం కాలువ వద్ద 150 క్యూసెక్కులు నీళ్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గ రైతులకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీర రఘు, జేసీఎస్ కన్వీనర్ సురేంద్రరెడ్డి, యువత అధ్యక్షుడు శ్రీనివాసులు, సర్పంచ్‌లు సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

చేజర్ల: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు దాదాపు అన్ని పూర్తయ్యాయని డిప్యూటీ తహసీల్దార్ విజయ్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలంలో 948 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించగా, అందులో 106 వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆధార్ నంబర్ సరిగా లేక, సర్వే నంబర్ తప్పుగా ఉండడం, కొందరు ఊరులో లేక, కొందరు చనిపోయిన వారు, ప్లాట్ నంబర్‌లు తప్పుగా ఉండడం వంటి కారణాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులకు తెలిపామని, త్వరలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోల ద్వారా ఆ తప్పులను సవరించి రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తామని తెలిపారు.

జన్నత్‌హుస్సేన్ సేవలు మరువలేనివి

ఉదయగిరి: గతంలో నెల్లూరు కలెక్టర్‌గా పని చేసిన విశ్రాంత ఐఏఎస్ జన్నత్‌హుస్సేన్ జిల్లా ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం తీరని లోటని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దానీ, ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్‌గా ఎంతో నిజాయితీగా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఎంతో మంది ఉర్దూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ముఖ్య కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు తెచ్చారన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యసేవలు



ఉదయగిరి: శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామాంజనేయులు



జలదంకి: రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉదయగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని ఉదయగిరి జడ్పీటీసీ మోది రామాంజనేయులు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని అప్పసముద్రం సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాడు-నేడు పథకం ద్వారా వైద్యశాలలను అభివృద్ధి చేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య నిపుణులను గ్రామాలకే రప్పించి వైద్యసేవలందేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి వినీత,హెచ్‌ఈ వెంకసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తూర్పురొంపిదొడ్లలో..

వరికుంటపాడు: మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 340 మంది రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆయేషా, అబీద్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు బత్తిన కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

జలదంకి: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి అన్నారు. శుక్రవారం అన్నవరం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్య శిబిరంలో 250 మంది రోగులకు స్పెషలిస్టు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్ రావు, సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ, పంచాయతీ కార్యదర్శి రేవతి, వైద్యులు అమ్రిన్, రోహిత్, అరవింద్, వెంకట సుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో బాధ్యతగా వ్యవహరించండి

ఆత్మకూరు: ఇప్పటి వరకు కొత్తగా ఓటర్లను చేర్చడం, మృతులు, గ్రామాల్లో నివాసం లేని వారి ఓట్లు తొలగించడం వంటివి నిర్వహించిన బీఎల్‌ఓలు రానున్న ఎన్నికల్లోనూ బాధ్యతగా వ్యవహరించాలని ట్రైనర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పట్టణ పరిధిలోని బీఎల్‌ఓలకు మున్సిపల్ ఎంజీఆర్ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ట్రైనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజుకు ఒక రోజు ముందుగానే కేటాయించిన ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఏవైనా ఓట్ల నమోదు పేర్లు పెండింగ్ వస్తే వాటిని పరిశీలించి పీఓలకు సహకరించాలన్నారు. దొంగ ఓట్లు పోల్ కాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇతర ట్రైనర్లు జి.రామిరెడ్డి, శివకుమార్, హరనాథ్, అన్ని సచివాలయాల బీఎల్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.